క్లుప్తంగా

సన్మానం



వర్ధన్నపేట : రాష్ట్ర డిప్యూటీ స్పీకర్‌గా నియమితులైన డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్‌ను స్థానిక ఎమ్మెల్యే నాగరాజు సచివాలయంలో బుధవారం శాలువాతో సన్మానించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌తోపాటు ఎమ్మెల్యే నాగరాజు కలిసి అభినందనలు తెలిపారు. నియోజకవర్గానికి సంబంధించిన సమస్యల పరిష్కారంలో సహకరించాలని కోరారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి



అరకతో నేల దున్నుతున్న రైతు

దుగ్గొండి : మండలంలోని పలు గ్రామాల్లో తొలకరి జల్లుల ఆగమనాన్ని కాంక్షిస్తూ రైతులు బుధవారం ఏరువాక పున్నమి ఘనంగా నిర్వహించారు. భూతల్లికి పసుపు, కుంకుమ, పాయసం సమర్పించి టెంకాయలు కొట్టారు. పాడి పంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నారు. దుక్కిటెద్దులను అందంగా అలంకరించి పొలాల్లో దున్నకాలు ప్రారంభించారు.

'విచారణ పేరుతో కక్షసాధింపు'



నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై విచారణ పేరుతో మాజీ సీఎం కేసీఆర్‌పై రాజకీయ కక్షసాధింపు చర్యకు పాల్పడుతోందని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరంపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. కేసీఆర్ కీర్తిని మసకబార్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి విశ్వప్రయత్నం చేస్తున్నాడని చెప్పారు. తెలంగాణ సాధించి దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

హద్దులు ఏర్పాటు చేయండి



పర్వతగిరి : మండలంలోని పెద్ద చెరువు కాల్వకు వెంటనే హద్దులు ఏర్పాటు చేయాలని ఆర్‌డీఓ సత్యపాల్ ఆదేశించారు. ఆయన పెద్ద చెరువును బుధవారం సందర్శించి పరిశీలించారు. కాల్వ హద్దులపై అడిగి తెలుసుకున్నారు. కాల్వకు హద్దులు ఏర్పాటు చేయాలని సర్వే విభాగం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నాయకుల అరెస్ట్, విడుదల



పర్వతగిరి : విచారణ కమిషన్ ఎదుట హాజరు కానున్న మాజీ సీఎం కేసీఆర్‌కు మద్దతుగా హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధమైన బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావును, పలువురు కార్యకర్తలను పోలీసులు బుధవారం అరెస్టు చేసి తదనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో రాజేశ్వర్‌రావు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌పై అవినీతి కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. అరెస్టైన వారిలో నాయకులు చింతపట్ల సోమేశ్వర్‌రావు, మాదుగుల రాజు, పరమేశ్వర్‌రావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

రాయపర్తి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి శ్రేణులను కోరారు. మండలంలోని మైలారంలో ఎంపీటీసీ కోఆర్డినేటర్ ఏసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి బుధవారం నిర్వహించిన సమావేశంలో రవీందర్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయాలన్నారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ఎల్లారెడ్డి, నాయకులు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు సాయం

గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన అయ్యప్ప గురుస్వామి, భజన మండలి కళాకారుడు తాటికొండ బ్రహ్మాచారి (70) అనారోగ్యంతో బుధవారం మృతి చెందగా అంత్యక్రియల కోసం గ్రామానికి చెందిన రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ బాధిత కుటుంబానికి రూ.5 వేలు అందజేశారు. అలాగే ఎన్ఆర్‌ఐ డాక్టర్ పసునూటి కల్యాణ్ రూ.5 వేలు, అయ్యప్ప భక్తులు రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో సోషల్ సర్వీస్ టీమ్ సభ్యుడు కర్ణకంటి రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యతో వికాసం

- సీడీపీఓ మధురిమ, ఎంఈఓ సారయ్య

నర్సంపేట : అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న పూర్వ ప్రాథమిక విద్యతో చిన్నారులు శారీరక, మానసిక వికాసం పెంచుకుంటారని సీడీపీఓ మధురిమ, ఎంఈఓ సారయ్య తెలిపారు. పట్టణంలోని రామాలయం స్కూల్ ఆవరణలోని 4వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం 'అమ్మమాట–అంగన్‌వాడీ బాట' కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని మామిడి మాకులు, బెలూన్లతో తోరణాలు కట్టి ముగ్గులు వేసి అలంకరించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తల్లులకు స్వాగతం పలికారు. అనంతరం ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ రమ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీడీపీఓ మధురిమ, ఎంఈఓ సారయ్య మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో నమోదైన వెంటనే చిన్నారులకు ఆటపాటలతోపాటు ఆంగ్ల మాధ్యమంలో విద్య అందిస్తున్నట్టు తెలిపారు. ఒక పూట భోజనం, కోడిగుడ్డు, స్నాక్స్ ఇస్తున్నట్టు చెప్పారు. అనంతరం ప్రీ స్కూల్ పిల్లలు, తల్లులకు ఎగ్ బిర్యానీతో భోజనం పెట్టారు. కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్ శోభారాణి, మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు నాయిని సునీత, మాజీ వార్డు సభ్యురాలు తక్కళ్లపల్లి ఉమ, అంగన్‌వాడీ టీచర్లు నల్లా భారతి, గౌసియా, ఆయాలు సునీత, విజయ, ఎస్ఎల్ఎఫ్ అధ్యక్షురాలు భాగ్య, ఏఎల్ఎంఎస్‌సీ సభ్యులు శంకేషి అనిత, చార్ల మౌనిక, బూస ప్రవళిక, గొర్రె శివాని, ఆర్‌పీలు మాధవి, ఉమ, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : మాట్లాడుతున్న ఎంఈఓ సారయ్య



వర్ధన్నపేట: ర్యాలీలో సీడీపీఓ డెబోరా, తదితరులు

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందలోని 3వ నంబర్ అంగన్‌వాడీ సబ్‌సెంటర్‌ను సీడీపీఓ డెబోరా సందర్శించారు. ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. మూడు నుంచి ఆరేళ్లలోపు వయసున్న చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రంలో అనేక సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. సామూహిక అక్షరాభ్యాసం చేయించడంతోపాటు ఐదేళ్లు పూర్తి చేసుకుని పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ప్రీ స్కూల్ సర్టిఫికెట్ అందజేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్లు మాధవి, భారతి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులపై జీలుగ ధరాభారం

- ఏడాదికే రెట్టింపైన వైనం

ఖానాపురం : రైతులకు కష్టాలు తప్పడం లేదు. పంటల సాగు నుంచి మొదలుకొని విక్రయాల వరకు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెట్టుబడులు పెరుగుతుండగా ఆదాయం తగ్గుతోందంటూ రైతులు వేదనకు గురవుతున్నారు. ప్రభుత్వం జీలుగ ధరలు ఏడాదిలో రెట్టింపు చేయడంతో రైతన్నలు బెంబేలెత్తుతున్నారు.

మండలానికి ధాన్యాగార కేంద్రంగా కీర్తి తెలిసిందే. పాకాల సరస్సు మండలానికి ప్రధాన నీటి వనరు. మండల పరిధిలో 12 వేల 200 మంది రైతులు ప్రధానంగా వరి, మక్కజొన్న, మిర్చి, పత్తి, అపరాల సాగు చేస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. పాకాల ఆయకట్టు కింద వరి పంట అధికంగా సాగు అవుతుంది. మండల పరిధిలో 18 వేల 270 ఎకరాల రెవెన్యూ భూములుండగా 4300 ఆర్ఓఎఫ్ఆర్, పోడు భూములున్నాయి. వర్షాకాలంతోపాటు యాసంగిలో వరి పంటలు సాగు చేయడం ఆనవాయితీగా వస్తోంది. వరుసగా రెండు పంటలు పండిస్తుండడంతో భూసారం తగ్గుతుండటం సహజం. ఈ క్రమంలో భూసారం పెంచుకునేందుకు రైతులు వరి పొలాలతోపాటు మక్కజొన్న, మిర్చి పంటలకు ముందు జీలుగ విత్తనాలు సాగు చేయడం పరిపాటి. ప్రభుత్వం ఏటా సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందిస్తోంది. గతేడాది జీలుగ విత్తనాల ధర సబ్సిడీ పోగా 30 కిలోల బస్తాకు రూ.1116గా ఉంది. కాగా ఈ ఏడాది ప్రభుత్వం 30 కిలోల జీలుగ విత్తనాల బస్తా ధరను సబ్సిడీ పోగా రూ.2137.50కు పెంచింది. ఈ క్రమంలో మండలంలో 150 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నా ఇప్పటివరకు కేవలం 32 క్వింటాళ్ల విత్తనాలు మాత్రమే విక్రయించారు. జీలుగ విత్తనాల ధర రెండింతలకు పెంచడంతో రైతులు చేసేదేమీ లేక పెసళ్లు కొనుగోలు చేసుకుని పంట పొలాల్లో చల్లుకుంటున్నారు.



కొనుగోళ్లు లేక ఆగ్రోస్‌లో నిల్వ ఉన్న జీలుగ బస్తాలు

ధర పెంపు సరికాదు



30 కిలోల జీలుగ విత్తనాల బస్తా ధరను సబ్సిడీ పోగా రూ.2137.50కు పెంచడం సరికాదు. ఏటా పంట దిగుబడులు, ఆదాయం తగ్గుతున్న దుస్థితి ఉండగా ప్రభుత్వం రైతులపై భారాలు మోపేలా రెండింతలు చేసింది. రైతులు జీలుగ విత్తనాలు కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం వ్యవసాయానికి దూరం చేసేలా వ్యవహరిస్తోంది. వెంటనే ధరను గతేడాది రేటుకు తగ్గించాలి.

– నామాల రవి, రైతు, పెద్దమ్మగడ్డ

పంట మార్పిడితో అధిక దిగుబడులు



రాయపర్తి : సదస్సులో మాట్లాడుతున్న హారిక



సంగెం : మాట్లాడుతున్న ఏఓ యాకయ్య

- ఉద్యాన విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ హారిక

రాయపర్తి : పంట మార్పిడితో అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ హారిక తెలిపారు. మండలంలోని మైలారంలో బుధవారం నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ఏటా పంటలు మార్చి పచ్చిరొట్ట ఎరువుల వినియోగం, విత్తనోత్పత్తి ద్వారా ఆదాయాన్ని పొందే అవకాశం ఉందన్నారు. భూసార పరీక్ష ఆధారిత ఎరువుల యాజమాన్యంతో పెట్టుబడి తగ్గడంతోపాటు అధిక దిగుబడులను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ స్వాతి, ఏఈఓ క్రాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని తీగరాజుపల్లి, సోమ్లతండా, కాపుల కనపర్తి, ఆశాలపల్లి, బీకేజీనాయక్ తండా, ఎల్గూర్ స్టేషన్‌ల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ నాగభూషణం మాట్లాడారు. అవసరమైన మేరకే రసాయనిక ఎరువులు వినియోగించాలని, సాగునీటి ఆదా చేయాలని సూచించారు. సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని, జీలుగ విత్తనాలతో భూమిలో సేంద్రియ కర్బనం పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సంధ్య, కిశోర్, సౌమ్య, నిర్మల, సంజనారెడ్డి, రాజు, శ్రీధర్, ఏఓ యాకయ్య, ఏఈఓలు కార్తీక్, సరిత, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలీలో నిర్వహించిన కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ సతీశ్ చంద్ర మాట్లాడారు. పంటల మార్పిడితో సుస్థిర ఆదాయం పొందవచ్చన్నారు. తెగుళ్ల నియంత్రణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ పద్మజ మాట్లాడుతూ చీడపీడల నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ హరిప్రసాద్‌బాబు, ఏఈఓలు స్మిత, భారతి, తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం



వర్ధన్నపేట : 108 వాహనంలో బుధవారం రాత్రి మహిళ ప్రసవించింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్టు 108 వాహన ఈఎంటీ కావటి నాగరాజు, పైలెట్ రాజు తెలిపారు. దంతాలపల్లికి చెందిన గాడుదుల మౌనిక కాన్పు నిమిత్తం స్థానిక సీహెచ్‌సీలో చేరగా వరంగల్‌లోని సీకేఎం ఆస్పత్రికి రెఫర్ చేయడంతో తీసుకెళ్తుండగా మార్గమధ్యలో 108 వాహన సిబ్బంది పురుడు పోయడంతో మగశిశువుకు జన్మనిచ్చింది. తల్లిని, శిశువును సీకేఎం ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు.

మోగనున్న బడిగంట



నెక్కొండ : నేడు బడిగంట మోగనుంది. ప్రభుత్వ పాఠశాలలను పునఃప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. బడిబాట కొనసాగుతున్న విషయం తెలిసిందే. విద్యార్థులు యూనిఫామ్స్, షూ, వాటర్ బాటిళ్లను సిద్ధం చేసుకుంటున్నారు. అధికారులు విద్యార్థులకు రెండు జతల చొప్పున యూనిఫామ్, పుస్తకాలు అందించనున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన చర్యలు జరుగుతున్నాయి. పాఠశాలలను ఊడ్చి, చెత్తాచెదారం తొలగించి ముస్తాబు చేస్తున్నారు.

భూభారతితో సమస్యల పరిష్కారం



రాయపర్తి: మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్



ఖానాపురం : సభాస్థలిలో గుమికూడిన రైతులు

- దరఖాస్తుల వెల్లువ

నెక్కొండ/రాయపర్తి/గీసుకొండ/ఖానాపురం/దుగ్గొండి : భూభారతి చట్టంతో రైతుల భూసమస్యలు పరిష్కరించనున్నట్టు తహసీల్దార్లు రాజ్‌కుమార్, ముల్కనూరి శ్రీనివాస్, రియాజుద్దీన్ తెలిపారు. నెక్కొండ, రాయపర్తి, గీసుకొండ, ఖానాపురం, దుగ్గొండి మండలాల్లో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. గీసుకొండ, ఖానాపురం, దుగ్గొండి మండలాల్లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దరఖాస్తులు అందజేశారు. గీసుకొండలో 525 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్లు రవికుమార్, రవీందర్, ఉమారాణి, రాజేశ్వర్‌రావు, ఎస్ఏ కిరణ్‌కుమారి, ఎంఆర్ఐ కొయ్యాడ చంద్రమోహన్, సాంబయ్య, శ్రీధర్, రాంబాబు, మల్లయ్య, ఏఆర్ఐలు సంధ్యారాణి, జయంతి, లక్ష్మి, అభిలాష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల ఉన్నతికి ప్రాధాన్యం

- డీపీఎం దయాకర్

నల్లబెల్లి : ప్రభుత్వం మహిళా సంఘాల ఉన్నతికి ప్రాధాన్యత ఇస్తోందని డీపీఎం దయాకర్ తెలిపారు. మదర్ థెరిస్సా మండల సమాఖ్య అధ్యక్షురాలు ఊటుకూరి భాగ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన వార్షిక మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. సంఘాల అభివృద్ధికి సమాఖ్య పాలకవర్గం పాటుపడాలని సూచించారు. చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు రావాలని కోరారు. రుణాలు, శిక్షణ, నైపుణ్యం తదితర అంశాలపై శిక్షణ ఇప్పిస్తామన్నారు. అనంతరం సమాఖ్య పాలకవర్గాన్ని అధ్యక్షురాలు ఊటుకూరి భాగ్యలక్ష్మి ప్రకటించారు. అధ్యక్షురాలిగా జంగిలి మమత, కార్యదర్శి ఈర్ల స్వప్న, కోశాధికారిగా ముత్యాల మౌనికతోపాటు సభ్యులు ఎన్నికైనట్టు తెలిపారు. నూతన పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన పాలకవర్గాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎం సునీత, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఖానాపురం : మండల కేంద్రంలోని చైతన్య మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా తుడి ప్రభావతి, కార్యదర్శిగా ఎద్దు శిరీష, కోశాధికారిగా గంట లక్ష్మి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు ప్రభావతి, ఏపీఎం కందిక సుధాకర్ మాట్లాడారు.



నూతన కార్యవర్గంతో దయాకర్, తదితరులు

మహిళలు సంఘాల సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. కిస్తీలు సకాలంలో చెల్లిస్తూ సంఘాల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో పర్వతగిరి ఏపీఎం కృష్ణమూర్తి, మాజీ అధ్యక్షురాలు కవిత, సీసీలు కరుణ, నర్సయ్య, అకౌంటెంట్ సంధ్యారాణి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతి సమాఖ్యకు..

దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రశాంతి మండల సమాఖ్యకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మర్రిపల్లికి చెందిన ధనలక్ష్మీ గ్రామైఖ్య సంఘానికి చెందిన ఇనుముల సరిత, కార్యదర్శిగా వెంకటాపురం గ్రామానికి చెందిన రుద్రమాదేవి గ్రామ సంఘానికి చెందిన ఓరుగంటి హిమరాణి, కోశాధికారిగా మహ్మదాపురం గ్రామానికి చెందిన యమున గ్రామ సంఘానికి చెందిన ఎద్దు జ్యోతి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఏపీఎం గుజ్జుల రాజ్‌కుమార్ వ్యవహరించారు.

బాలుడి ఆత్మహత్యపై విచారణ చేపట్టాలి

నల్లబెల్లి : మండలంలోని కొండాపూర్‌లో ఇటీవల చోటు చేసుకున్న బాలుడు జెల్ల శ్రీకాంత్ ఆత్మహత్యపై విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని అణగారిన వర్గాల ఐక్యవేదిక వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పరికి కోర్నెల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ప్రజాసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీకాంత్(14)ను కులం పేరుతో దూషిస్తూ విచక్షణరహితంగా దాడి చేయడంతో ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సాంబయ్య, పవన్, ఐలయ్య, పులి రమేశ్, అనిల్, రవి తదితరులు పాల్గొన్నారు.

మెనూ అమలులో నిబంధనలు తప్పనిసరి

- ఎంఈఓలు శ్రీధర్, రత్నమాల, వెంకటేశ్వర్లు

వర్ధన్నపేట/నెక్కొండ/దుగ్గొండి : ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ అమలులో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వర్ధన్నపేట, నెక్కొండ, దుగ్గొండి ఎంఈఓలు మామునూరు శ్రీధర్, రత్నమాల, వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద, నెక్కొండ, దుగ్గొండిలో ఉపాధ్యాయులు, సీసీహెచ్ వర్కర్లు, వంట ఏజెన్సీ నిర్వాహకులతో బుధవారం నిర్వహించిన వారు మాట్లాడారు. మెనూ ప్రకారమే భోజనం తయారు చేయాలని, విద్యార్థులందరికీ పౌష్టికాహారం అందాలని, వంట సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వంట గదులు, పాత్రలు, కూరగాయలు, బియ్యం, సామగ్రి శుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజన అమలుకు ఉపాధ్యాయుల్లో ఒకరు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టి లాగ్, టేస్ట్ రిజిస్టర్‌లో రికార్డులు నమోదు చేయడంతోపాటు పర్యవేక్షించాలని చెప్పారు. సమావేశాల్లో మండల నోడల్ అధికారి రవికుమార్, హెచ్ఎంలు రంగారావు, రవీందర్, పరమేశ్వర్, హేమమాలిని, రేణుక, హెచ్ఎంలు రామస్వామి, జ్యోతిలక్ష్మీ, భద్రమ్మ, కృష్ణమూర్తి, కాళిదాసు, విజయ, రంగా అనిల్‌కుమార్, సీహెచ్.రమేశ్, బండ రమేశ్, బ్యూలా బెట్రిస్, ప్రసన్న, రాజయ్య, గణేశ్, సుల్తానా, తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట : మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీధర్

స్కూళ్లకు పూర్వవైభవం తీసుకురావాలి

- ఎంపీడీఓ అరుంధతి

దుగ్గొండి : ప్రభుత్వ స్కూళ్లకు పూర్వవైభవం తీసుకురావాలని ఎంపీడీఓ లెక్కల అరుంధతి కోరారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బడిబాట కార్యక్రమంపై బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ స్కూళ్లలోనే అత్యున్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఉచిత మధ్యాహ్న భోజనం, యూనిఫారాలు, డిజిటల్ తరగతులు, విశాలమైన క్రీడాస్థలాలు, తదితర సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. అయినా నానాటికీ ప్రభుత్వ స్కూళ్లకు ఆదరణ తగ్గుతోందని ఆందోళన వెలిబుచ్చారు. విద్యార్థుల సంఖ్య పెంచి పూర్వవైభవం తీసుకురావాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల మీదే ఉందన్నారు. సమావేశంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఏపీఎం రాజ్‌కుమార్, హెచ్‌ఎంలు రామస్వామి, భద్రమ్మ, జ్యోతిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ అరుంధతి

గుడిసెవాసులకు పక్కా గృహాలు కట్టించాలని వినతి

నర్సంపేట : పట్టణంలోని సీపీఐ కాలనీలోనిగుడిసెవాసులకు పట్టాలిచ్చి పక్కా గృహాలు కట్టించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రమేశ్ మాట్లాడారు. కాలనీలో తాగునీటి, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ కాలనీ కమిటీ కార్యదర్శి గడ్డం నాగరాజు, సహాయ కార్యదర్శి పిట్టల సతీశ్, నాయకులు మమత తదితరులు పాల్గొన్నారు.

భూములను కాపాడాలని..

పర్వతగిరి : తమ భూములను కబ్జా నుంచి కాపాడాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన అప్పని రవీందర్, కుంచాల సోమయ్య, అప్పని మాధవరావు, సంపత్‌కుమార్ డీఆర్‌ఓ విజయలక్ష్మికి బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రవీందర, సోమయ్య, మాధవరావు, సంపత్‌కుమార్ మాట్లాడారు. మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి తమ భూమి కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

- ట్రాన్స్‌కో డీఈ తిరుపతి

దుగ్గొండి : కోతలు లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసుకుంటున్నట్టు ట్రాన్స్‌కో డీఈ తిరుపతి తెలిపారు. మండలంలోని తిమ్మంపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యుత్ ట్రిప్ అవుతుండడంపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో కోతలు తగ్గించినట్టు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు, లైన్ ఫాల్ట్, లైన్లను సరి చేసే క్రమంలో ఎల్‌సీ తీసుకోవాల్సి వస్తుండడంతో కొంత మేరకు సరఫరా నిలిపేస్తున్నట్టు తెలిపారు. అప్పుడప్పుడు మరమ్మతుల కోసం మాత్రమే సరఫరా నిలిపేస్తున్నట్టు వివరించారు. సబ్‌స్టేషన్‌లో మరో కట్ పాయింట్ ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. సమావేశంలో ఏడీఈ లక్ష్మణ్, ఏఈలు రామ్మూర్తి, తిరుపతి, లైన్ ఇన్‌స్పెక్టర్ అజీమ్ పాషా, తదితరులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఈ తిరుపతి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఖానాపురం : అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు తెలిపారు. మండలంలోని బుధరావుపేటలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను బుధవారం ఆయన అందజేసి మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం పేదల సొంతింటి కల సాకారం చేస్తోందని చెప్పారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎల్లగౌడ్, నాయకులు మధుసూదన్‌రావు, ఉపేందర్, ప్రశాంత్, మురళీ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో హరిబాబు, తదితరులు

బీజేపీ మండల కమిటీ నియామకం



నియామక పత్రం అందజేస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు అనిల్

రాయపర్తి : బీజేపీ మండల కమిటీని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నూనె అనిల్ బుధవారం నియమించారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన నియామక పత్రం అందజేసి మాట్లాడారు. ప్రధాన కార్యదర్శులుగా మందపురి రాజు, నిమ్మల అనిల్, ఉపాధ్యక్షులుగా పెద్దోజు వీరబ్రహ్మం, గోరంట్ల ప్రభాకర్, మూనావత్ భద్రునాయక్, చిర్ర నాగరాజు, కార్యదర్శులుగా చిర్ర శరత్, మందపురి రాజశేఖర్, కొండా అశోక్, కర్ర వాణిరెడ్డి, కోశాధికారిగా బూర్గు శిరీషలను నియమించినట్లు ప్రకటించారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి వడ్లకొండ రవి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎనగందుల శ్రావణ్‌కుమార్, జనరల్ సెక్రటరీ రాపాక ప్రశాంత్, బీజేవైఎం అధికార ప్రతినిధి పెండ్యాల గణేశ్, మండల అధ్యక్షుడు మంచాల సుమన్, నాయకులు జక్కుల సందీప్, వాసం ప్రశాంత్, రాసాల రాకేశ్, సొడ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ ఆపరేటర్లపై పోల్ ట్యాక్స్ తగ్గించాలి

నర్సంపేట : పోల్ ట్యాంక్స్ తగ్గించాలని కోరుతూ కేబుల్ ఆపరేటర్ల సంఘం స్థానిక డివిజన్ అధ్యక్షుడు జి.రాజు, ఖానాపురం మండల అధ్యక్షుడు మెరుగు గంగాధర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం డివిజన్ అధ్యక్షుడు రాజు, మండల అధ్యక్షుడు గంగాధర్ మాట్లాడారు. అనేక ఏళ్లుగా ప్రజలకు వినోదం అందించేలా కేబుల్ టీవీ ప్రసారాలను కొనసాగిస్తున్న కేబుల్ ఆపరేటర్లపై ప్రభుత్వం పోల్ టాక్స్ పేరుతో భారం మోపడం సరికాదన్నారు. ఇప్పటికే కేబుల్ టీవీలు నష్టాల్లో నడుస్తుండగా ప్రభుత్వం అదనంగా వాడుతున్న కరెంటు స్తంభాలను లెక్కించి పన్ను వసూలుకు నిర్ణయించడంతో తాము మరింత నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం నెక్కొండ, చెన్నారావుపేట మండల అధ్యక్షులు పాపిరెడ్డి, వేముల వేణు గౌడ్, నాయకులు చీకటి ఓదెలు, కొలిపాక రాజాలు, కూస తిరుపతి, వీరబోయిన శ్రీనివాస్, గోపు వేణు రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మెరుగు బాబు, సుధాకర్, ప్రభాకర్, ప్రదీప్, సతీశ్, దూపటి కుమారస్వామి, పీర్ నాయక్, రామ్మూర్తి, చిట్యాల దయాకర్, తదితరులు పాల్గొన్నారు.